

- దట్టంగా కురుస్తున్న మంచుతో జనం ఉక్కిరిబిక్కిరి
- దగ్గరికొచ్చేదాకా కనిపించని వాహనాలు
- రోడ్లపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అప్రమత్తంగా లేకుంటే ప్రమాదాలకు అవకాశం
- అత్యవసరమైతేనే నైట్ జర్నీ చేయాలని నిపుణుల సూచన
- రానున్న పండుగల ప్రయాణాలూ కష్టాలే..
- ఆరోగ్యంపైనా తీవ్ర ప్రభావం చూపే ఛాన్స్



# పొగమంచుతో పైలం



చలికాలం కావడంతో ఉదయం తొమ్మిది దాటినా సూర్యుడు రావడం లేదు. సాయంత్రం నుంచి ఉదయం వరకు చల్లని వాతావరణం ఉంటున్నది. జనం చలికి గజగజ వణికిపోతున్నారు. ఉదయం 10గంటల వరకు మంచు దట్టంగా కురుస్తున్నది. ఈ నెలతోపాటు జనవరి మొత్తం దట్టమైన పొగమంచు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఫిబ్రవరి ప్రారంభంలో మంచు తగ్గుముఖం పట్టవచ్చని తెలియజేస్తున్నారు.

– న్యూస్ నెట్‌వర్క్, (నమస్తే తెలంగాణ)



## ఆరోగ్యంపై ప్రభావం..

పొగ మంచు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులపై పంజా విసురుతున్నది. శ్వాసకోశ, చర్మ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. హృదయ స్పందనల్లో మార్పులు వస్తాయి. పంటలు, పశు పక్షాదులకు సైతం తీవ్ర నష్టానికి గురిచేస్తున్నది. ఈ నేపథ్యంలో పొగమంచుతో అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు చిన్నపాటి గాలి తగిలినా జలుబు, దగ్గు వంటి రుగ్మతలు దరి చేరుతాయి. చిన్నారులు, ఆస్తమా రోగులుకు సాయంత్రం నాలుగు గంటల తర్వాత ఇంటి నుంచి బయట వెళ్లకుండా చూసుకోవడం మంచిది. ఆహారం విషయంలో జాగ్రత్తలు పాటించాలి.

## ఈ జాగ్రత్తలు పాటించాల్సిందే..

- మంచుతో జాగ్రత్తలు పాటించాల్సిందేనని నిపుణులు సూచిస్తున్నారు. కొత్త రోడ్లపై మలుపులు, రహదారుల స్థితిగతులపై అవగాహన ఉండదు.
- మంచు తెరలు తొలిగిపోయాకే ప్రయాణాన్ని కొనసాగించాలి.
- వాహనానికి వెనుక, ముందు రేడియం స్టిక్కర్లను తప్పనిసరిగా అతికించాలి. తక్కువ వెలుతురులోనూ స్పష్టంగా రంగులు వెదజల్లే స్టిక్కర్లు అంటించాలి.
- వాహనానికి ఫాగ్ ల్యాంప్స్ ఏర్పాటు చేసుకోవాలి. పసుపు వర్ణంతో వెలిగే ఈ దీపాలు శీతాకాలంలో ఎంతో మంచిది. మంచు తెరల నుంచి కాంతి ప్రసరించి వెలుతురు కనిపిస్తుంది.
- బండి స్పీడ్ లిమిట్‌లో పెట్టుకోవాలి. ముందు వెళ్తున్న వాహనాలను అనవసరంగా ఓవర్ టేక్ చేసే ప్రయత్నం చేయొద్దు.
- రాత్రంతా మంచు కురవడంతో రోడ్లు తడిగా ఉంటాయి. బ్రేకులేసినా వాహనం జారి పడిపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది.
- వెహికల్ లైట్లు సరిగా పనిచేస్తున్నాయో లేదో చెక్ చేసుకోవాలి.
- వాహనాలను రోడ్ల పక్కకు తీసుకెళ్లి ఖాళీ ప్రదేశంలో లేదా వెలుతురు ఉన్న చోట నిలిపితే ట్రాఫిక్‌కు ఇబ్బంది ఉండకపోగా, ప్రమాదాలను నివారించవచ్చు.
- బండి ఆగిపోతే నంబరు 100కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందిస్తే వాహనాన్ని తొలగించడం, ప్రమాద నివారణకు చర్యలు చేపడతారు.
- అద్దాలను తుడిచే వైఫర్లు సక్రమంగా ఉంచుకోవాలి. మోటర్ వెహికిల్స్‌లో జర్నీ చేసేటప్పుడు వైఫర్లు వేయడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు.
- ప్రయాణించే వాహనం పూర్తిగా కండిషన్‌లో ఉండాలి. ఇంజిన్, టైర్లు, ముందు అద్దాలు సరిగ్గా ఉంటేనే నడుపాలి.



విద్యుత్ దీపాలతో అలంకరించిన కొమురవెల్లి మల్లన్న ఆలయం

# 7న మల్లన్న కల్యాణం

## ఏర్పాట్లు చేస్తున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ అధికారులు



చేర్యాల, జనవరి 1: భక్తుల కొంగుబంగారం కొమురవెల్లి మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం ఈనెల 7వ తేదీన (ఆదివారం) అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నారు. ఈ కల్యాణోత్సవానికి రాష్ట్ర నలుమూలలతోపాటు పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. దీంతో ఆలయవర్గాలు స్వామి కల్యాణ ఆహ్వాన పత్రికలను మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, దాతలు, అధికారులు, భక్తులకు అందజేస్తున్నారు. ఈ మహోత్సవాన్ని కనులారా చూసి తరలించాలని ఆలయ వర్గాలు కోరుతున్నాయి.

**వరుడు:** మల్లికార్జున స్వామి
**వధువులు:** మేడలాదేవి, కేతమ్మ దేవీ
**సుముహూర్తం:** స్వస్తిశ్రీ శోభకృత్ నామ సంవత్సరం, మార్గశిర మాసం, ఏకాదశి (07.01.2024 ఆదివారం), ఉదయం: 10–45 గంటలకు..
**కల్యాణ వేదిక:** కొమురవెల్లి పుణ్యక్షేత్రంలోని ఇంద్రకీలాద్రి ఆలయ ప్రాంగణంలో ఉన్న తోటబావి
**కన్యాదాతలు:** మహాదేవుని వంశస్తులు
**స్వీకర్తలు:** పడిగన్నగారి వంశస్తులు
**వేద పర్యవేక్షణ:** 1008 వీరశైవ పీఠాధిపతి మణికంఠ శివాచార్యుల ఆధ్వర్యంలో
**పురోహితులు:** నడిపుడి మఠం భవానయ్య స్వామి, భువనేశ్వరస్వామి, ఆనందయ్య, జ్ఞానేశ్వర్‌శాస్త్రి, చంద్రశేఖర్‌స్వామి, భద్రయ్యస్వామి,
**వ్యాఖ్యాతలు:** డాక్టర్ మహంతయ్య, నందుల మఠం శశిభూషణ సిద్ధాంతి స్వామిజీ
**ముఖ్య అతిథులు:** స్వామి వారి భక్తులు
**ఆహ్వానితులు:** ఆలయ కార్యనిర్వాహణాధికారి, వీరశైవ అర్చక, ఒగ్గు పూజారుల బృందం, ఆలయ సిబ్బంది.

## రెండు రోజుల పాటు పెండ్లి వేడుకలు

స్వామి వారి కల్యాణోత్సవ వేడుకలను ఆలయవర్గాలు రెండు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 7న ఉదయం 5గంటలకు స్వామి వారికి దృష్టికుంభం (బలిహరణం), 10–45గంటలకు స్వామికల్యాణం, అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం, రాత్రి 7గంటలకు రథోత్సవం (బండ్లు తిరుగుట). 8వ తేదీ సోమవారం ఉదయం 9గంటలకు స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, అనంతరం మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ, మహా మంగళహారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## భక్తజన సంద్రంగా మల్లన్న క్షేత్రం

- 20వేల మందికి పైగా దర్శించుకున్న భక్తులు
- ప్రత్యేక పూజలతో మొక్కుల చెల్లింపు

చేర్యాల, జనవరి 1: ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారిపోయింది. స్వామిని దర్శించుకునేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 20వేల మందికి పైగా భక్తులు కొమురవెల్లికి తరలివచ్చినట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. కొత్త సంవత్సరం మొదటి రోజు కావడంతో చేర్యాల, సిద్దిపేట, హుస్నాబాద్, గజ్వేల్, జనగామ, బచ్చన్నపేట, కరీంనగర్ తదితరల ప్రాంతాల నుంచి భక్తులు భారీగా వచ్చారు. ఏటా మొక్కులు చెల్లించుకునే భక్తులు శనివారం ఉదయం నుంచే మల్లన్న క్షేత్రానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ నిర్వహణలో ఉన్న గదులతోపాటు ప్రైవేటు గదులు అద్దెకు తీసుకుని బస చేశారు. ఆదివారం కోనేరులో స్నానం చేసి, స్వామి దర్శనానికి క్యూలో గంటల పాటు వేచి దర్శించుకున్నారు. భక్తులు అర్చన, ప్రత్యేక పూజలు, కేశఖండన, నజరు, మహామండప, చిలుక పట్నం, బోనం, టెంకాయలు, హుండీలో కానుకలు వేసి మొక్కులు సమర్పించుకున్నారు. మరికొందరు తమ మొక్కులు తీర్చాలని గంగరేగు చెట్టు వద్ద ముడుపులు, సంతానం కలగాలని ఒల్లు బండ పూజలు, రాతిగీరల వద్ద మొక్కులు, కోడెను కట్టివేసి స్వామి వారిని వేడుకున్నారు. ఏఈవో వైరాగ్యం అంజయ్య, సూపరింటెండెంట్ నీలశేఖర్, ఆలయ సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు సేవలు అందించారు.



రాజగోపురం ముందు భక్తుల సందడి